సాక్షి
పల్నాడు
మంగళవారం । 5 । మార్చి । 2024




భక్తులకు అన్న సంతర్పణ

వేమూరు: బాల కోటేశ్వర కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య అన్నదానం సత్రంలో భక్తులకు అన్న సంతర్పణ చేయనున్నట్లు సత్రం అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు తెలిపారు.



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చిలకలూరిపేట: చిలకలూరిపేట మారుతీనగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.40 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ప్రత్తిపాటి శరత్ కస్టడీ పిటిషన్‌పై తీర్పు రేపటికి వాయిదా

సాక్షిప్రతినిధి, విజయవాడ: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ పోలీసు కస్టడీ పిటిషన్‌పై ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ చీఫ్ మేజిస్ట్రేట్ కరీముల్లా తీర్పు వాయిదా వేశారు. అవెక్సా కార్పొరేషన్‌లో ప్రత్తిపాటి శరత్ అదనపు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో డొల్ల కంపెనీలు సృష్టించి నిధుల మళ్లింపు, జీఎస్టీ ఇన్ పుట్ సబ్సిడీ పొందారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో శరత్ ఇప్పటికే జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. శరత్‌ను తమ కస్టడీకి అప్పగించాలని మాచవరం పోలీసులు కోర్టులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ 1వ ఏసీఎంఎం కోర్టులో సోమవారం సాయంత్రం వాదనలు జరిగాయి. మేజిస్ట్రేట్ కరీముల్లా ఎదుట ఇరుపక్షాలు తమ వాదనలు వినిపించారు. కంపెనీ లావాదేవీలకు సంబంధించి ఇప్పటికే విచారణ పూర్తి అయిందని, ఈ దశలో పోలీసు కస్టడీకి నిందితుడిని ఇవ్వాల్సిన అవసరం లేదని డిఫెన్స్ న్యాయవాది కిలారు బెనర్జీ వాదనలు వినిపించారు. బోగస్ పత్రాలతో ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందారని చెబుతున్న సమయంలో శరత్ కంపెనీలోకి ఇంకా ప్రవేశించ లేదన్నారు. కేవలం 67 రోజులు మాత్రమే ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారని వివరించారు. లేని సమయంలో జరిగిన వాటితో నిందితుడికి సంబంధం లేదన్నారు. కాగా, అక్రమాలను వెలికి తీయాల్సి ఉందని, నిందితుడు శరత్.. తన తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో ఆయన పదవిని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని, వీటిపై మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉన్నందున పోలీసు కస్టడీకి ఇవ్వాలని ప్రభుత్వం తరఫున హైకోర్టు పీపీ దుష్యంత్ రెడ్డి వాదనలు వినిపించారు. పలు డొల్ల కంపెనీలను సృష్టించి నిధులు మళ్లించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనిపై నిందితుడిని పోలీసు కస్టడీలోకి తీసుకుని మరింతగా విచారిస్తే కానీ అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇరు పక్షాల వాదనాలు విన్న మేజిస్ట్రేట్ పోలీసు కస్టడి పిటిషన్‌పై తీర్పును ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారు. శరత్ తరఫున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై పోలీసులు అదే రోజు కౌంటర్ దాఖలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా వన్‌స్టాప్ సెంటర్(ఓఎస్‌సీ) నందు ఖాళీగా ఉన్న పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి కె.ఉమారాణి సోమవారం తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు డిస్ట్రిక్ వెబ్‌సైట్ http://palnadu.ap.gov.in, http://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌ల నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ ప్రకారం పూర్తి చేసి అన్ని ధ్రువపత్రాలు నకలు జత చేసి ఈనెల 22లోగా జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారతా అధికారి, చాకిరాలమిట్ట, బరంపేట నరసరావుపేట అడ్రస్‌లో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ లేదా కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలన్నారు.

అమరేశ్వరుని హుండీ ఆదాయం రూ.20లక్షలు



అమరావతి: ప్రఖ్యాత శైవక్షేత్రం అమరావతి అమరేశ్వర స్వామివారి దేవస్థానం హుండీ కానుకల ఆదాయం రూ.20లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథ శర్మ తెలిపారు. సోమవారం దేవాలయంలోని అన్ని హుండీల్లోని కానుకలను దేవదాయ శాఖ పరిశీలకులు వెంకట శ్రీనివాస్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 రోజులకు హుండీల ద్వారా రూ.18,37,744లు, అన్నదానం హుండీల ద్వారా రూ.1,63,085లు ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, నరసరావుపేట సేవా సమితి, పెదకూరపాడు సేవా సమితి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

20లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

గుంటూరు వెస్ట్ : రిటైర్డ్ ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లు ఈ నెల 20లోపు నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో బయోమెట్రిక్ రూపంలో సమర్పించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సర్టిఫికెట్లు అందజేయాల్సిన సమయం గత నెల 29తోనే ముగిసిందన్నారు. మంచంలో ఉన్నవారు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు ఏటీఓకి తెలియజేస్తే పెన్షన్ ఆగకుండా చూస్తారని తెలిపారు.

కోటయ్య దర్శనానికి వేళాయె

రేపటి నుంచి కోటప్పకొండ తిరునాళ్ల

- ఏకాదశి నుంచి ఆలయానికి భక్తులు రాక
- మూడురోజుల పాటు కొనసాగనున్న భక్తుల రద్దీ
- తిరునాళ్లకు 15లక్షల మంది యాత్రికులు వస్తారని అంచనా
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం



విద్యుద్దీపకాంతుల్లో వెలిగిపోతున్న కోటప్పకొండ (ఫైల్)

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో ఈనెల 8వ తేదీన నిర్వహించే తిరునాళ్లకు ప్రభుత్వ శాఖలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకాదశి సందర్భంగా ఈనెల 6వ తేదీ నుంచే తిరునాళ్ల ప్రారంభమై, కొండకు భక్తుల రాక ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు కొండలో భక్తుల తాకిడి నెలకొననుంది. లక్షలాదిగా యాత్రికులు తరలివచ్చే తిరునాళ్ల కోసం ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది దాదాపు 15లక్షల మంది తిరునాళ్లకు వస్తారని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలు ఇప్పటికే కోటప్పకొండలో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.



స్వామివారి మూలవిరాట్

సిద్ధంగా ఆలయ ప్రాంగణం..

ఐదు క్యూలైన్‌ల ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, వీఐపీ దర్శనంతో ఉచిత దర్శనానికి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. ఎండ వేడిమి అధికం కావడంతో ఆలయ ప్రాంగణంతో పాటు పార్కింగ్ ప్రాంతంలో షామియానాలు, చలువ పందిళ్లు సిద్ధం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారి ప్రసాదాలైన లడ్డూలు 2.5లక్షలు, అరిసెలు లక్ష సిద్ధంగా ఉంచారు. క్యూలైన్‌లోని భక్తులకు అందించేందుకు తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, పాలు అందుబాటులో ఉంచారు.

తుది దశలో కొండ కింద ఏర్పాట్లు..

జాతర జరిగే కొండ దిగువ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తిరునాళ్ల బందోబస్తుకు 2 వేల మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారు. 14 క్లస్టర్లుగా తిరునాళ్ల జరిగే ప్రాంతాన్ని విభజించి డీఎస్పీ స్థాయి అధికారిని ఒక్కో క్లస్టర్‌కు నియమించారు. ఆర్అండ్‌బీ ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లను ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం పర్యవేక్షిస్తుంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా చిలకలూరిపేట మేజర్ కెనాల్ ఐదు అడుగుల నీటి ప్రవాహం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికుల కోసం రెండు తాత్కాలిక బస్టాండ్‌లను ఏపీఎస్ ఆర్టీసీ సిద్ధం చేస్తోంది. కొండ దిగువ నుంచి ఆలయ ప్రాంగణానికి యాత్రికులను తరలించేందుకు తిరుమల నుంచి ప్రత్యేక బస్సులను తీసుకువస్తున్నారు.

రాష్ట్ర పండుగ నిధుల విడుదల..

కోటప్పకొండ తిరునాళ్లను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ్గా 2008లో గుర్తించి ప్రతి ఏడాది నిధులు విడుదల చేస్తోంది. ఈ మేరకు రూ.30లక్షల నిధులను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ విడుదల చేశారు. తిరునాళ్ల ఏర్పాట్ల కోసం ఈ నిధులను వినియోగించనున్నారు.

పట్టువస్త్రాలు అందించనున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి..

మహాశివరాత్రి రోజున స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది పట్టువస్త్రాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ జీఓను విడుదల చేశారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- కలెక్టరేట్ స్పందనకు 108 అర్జీలు



అర్జీదారుల సమస్య వింటున్న జిల్లా కలెక్టర్, జేసీ

నరసరావుపేట: కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' స్పందనలో 108 ఫిర్యాదులను కలెక్టర్ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం స్వీకరించారు. ఆ అర్జీలను ఆయా శాఖలకు అందిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో అన్నదానం నిర్వహించారు.

రికార్డులు తారుమారుచేసే అధికారులపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ గ్రామంలో భూముల రీసర్వేలో అక్రమాలు చేసిన, కోర్టు వివాదాల్లో ఉన్న భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. జాలలపాలెంలో స్మశానాలు, చెరువులు ఆక్రమించినా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– ప్రజా సంఘాల నాయకులు, బాధితులు

పొలం రాయించుకొని గెంటేశారు..

నాకు గ్రామంలో 1.17ఎకరాల పొలం ఉండగా నా మేనల్లుడు, అతని భార్య నా బాగోగులు చూస్తానని నమ్మబలికి రాయించుకున్నారు. ఇప్పుడు తినేందుకు తిండి పెట్టకుండా ఇంటి నుంచి బయటకు గెంటేశారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

– కోనేరు భాగ్యమ్మ, చంద్రాజుపాలెం, బెల్లంకొండ మండలం

జీజీహెచ్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ కేంద్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయి. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గర్భాశయ క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ వెల్లడించారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గుంటూరు జీజీహెచ్, మెడికల్ కాలేజీలో పనిచేసే మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ పరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ పరీక్షలు నిరంతరంగా జరిగే విధంగా ప్రణాళికలను సిద్ధం చేశామని, డీఎంఈ డాక్టర్ నరసింహం ఆదేశాల మేరకు ఈ పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. 40 నుంచి 45 సంవత్సరాలు దాటిన మహిళలు ముందస్తుగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. క్యాన్సర్ విషయంలో అనేకమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార న్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ వెంకటరెడ్డి, గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జయంతి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, నాట్కో సమన్వయకర్త అశోక్ కుమార్ పాల్గొన్నారు.



కల్యాణ వైభోగమే..!

అమరేశ్వరుని కల్యాణోత్సవం కార్యక్రమాలు ఇవే..




కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు(ఫైల్)

అమరావతి: పంచారామంగా ప్రసిద్ధి చెందిన అమరావతి క్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామివారికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణోత్సవంలో నిర్వహించే కార్యక్రమాల వివరాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపినాథ శర్మ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

- ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామివారిని పెండ్లికుమారుడిని చేయటం
- 6వ తేదీన విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, వాస్తుపూజ, వాస్తుహోమం, పర్యగ్నికరణం, మృత్సంగ్రహణ, అంకురారోపణ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణ
- 7వ తేదీన రాత్రి ఏడు గంటలకు స్వామివారిని పురవీధుల్లో పులివాహనం, పల్లకీపై గ్రామోత్సవం
- 8 తేదీ మహా శివరాత్రి పర్వదినాన ఉదయం 3 గంటలకు ఏకరుద్రాభిషేకాలు ప్రారంభం. రాత్రి 9 గంటలకు లింగోద్భవకాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం. రాత్రి ఒంటి గంటకు ఎదుర్కోలు ఉత్సవం 2.45 నిమిషాలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం.
- 9వతేదీ ఉదయం 8గంటలకు చిలుక, నంది, రథ వాహనాలలో స్వామివారి గ్రామోత్సవం. రాత్రి 7 గంటలకు స్వామివారిని కీలు గుర్రంపై గ్రామోత్సవం. - 10వతేదీ సాయంత్రం 4 గంటలకు స్వామివారి దివ్య రథోత్సవం
- 11వ తేదీ ఉదయం 10 గంటలకు చూర్ణోత్సవం, 11 గంటలకు వసంతోత్సవం, 12 గంటలకు పూర్ణాహుతి, రాత్రి పది గంటలకు ధ్వజావరోహణం నిర్వహిస్తామన్నారు.
- 5వ తేదీ మొదలుకొని 11 వతేదీ వరకు ప్రతిరోజు ప్రాతఃకాలం, సాయంకాలం బలిహరణ నిర్వహిస్తామని, అలాగే 12వ తేదీ నుంచి 14వతేదీ వరకు స్వామి వారికి ఏకాంతసేవ, పుష్పయాగ శయనోత్సవాలు శాస్త్రోక్తంగా శైవాగమ శాస్త్రప్రకారం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా 'సిద్ధం'

- ఇప్పటికే ప్రారంభమైన ఏర్పాట్లు
- భారీగా తరలివెళ్లేలా ప్రణాళిక
- వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



చిలకలూరిపేట: రాష్ట్రంలో ఇప్పటికే భీమిలి, దెందులూరు, రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలు ఒకదానిని మించి మరొకటి విజయవంతం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో నిర్వహించనున్న నాలుగో సిద్ధం సభపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నాలుగో సిద్ధం సభకు పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి 15లక్షల మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేదరమెట్ల సిద్ధం సభకు తరలివెళ్లేందుకు చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఏర్పాట్లపై నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడారు..

- ఇప్పటికే రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో నిర్వహించిన సిద్ధం సభలు అంచనాలకు మించి విజయవంతం అయ్యాయి. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా మేదరమెట్లలో నిర్వహించనున్న నాలుగో సిద్ధం సభపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు అనుగుణంగా చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి సిద్ధం సభకు భారీగా తరలివెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించాం. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తర్వాత ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలు పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో, ప్రజల ఆశీస్సులతో విజయవంతం అయ్యాయి. నియోజకవర్గం నుంచి జిల్లాలోని ఇతర నియోజకవర్గాల కన్నా ఎక్కువ మంది సిద్ధం సభకు హాజరయ్యేలా లక్ష్యం నిర్దేశించుకొని పని చేస్తున్నాం.
- ఇప్పటికే పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించటంతో పాటు, క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక నాయకులతో మాట్లాడుతున్నాం. పార్టీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్, ఇతర అగ్రనాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. పార్టీ కింది స్థాయి కార్యకర్తల నుంచి ప్రజా ప్రతినిధుల వరకు అందరూ సమష్టిగా కార్యక్రమం విజయవంతం చేసేలా సమాయత్తం చేస్తున్నాం. సిద్ధం సభ నిర్వహిస్తున్న మేదరమెట్లకు తరలివెళ్లేందుకు చిలకలూరిపేట అనువైన ప్రాంతం. సభకు వెళ్లేందుకు వందలాది కార్లు, బైకులతో పాటు 700 బస్సులు ఏర్పాటు చేస్తున్నాం. మండల కేంద్రాలతో పాటు ప్రతి గ్రామం, పట్టణంలో ప్రతి వార్డు నుంచి సభకు హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించాం. సభకు వెళ్లేవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, భోజన వసతి కల్పిస్తాం.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషి. ఆయన ప్రతి ఆలోచన ప్రజలకు ఎలా మేలు చేయాలన్నదే. కరోనా కష్టకాలంలో సైతం ఆర్థిక పరిస్థితులు ఏమాత్రం సహకరించకున్నా, ఏ సంక్షేమ పథకం అమలును నిలిపివేయలేదు. అది ప్రజలపై ఆయనకు ఉన్న ప్రేమకు నిదర్శనం. ఇలాంటి గొప్ప నాయకుడు పాల్గొంటున్న సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంలా సిద్ధం సభను భావించాలి. తమ ఇంట్లో జరుగుతున్న వేడుకలా భావించి సిద్ధం సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

జన సంక్షేమమే జగనన్న లక్ష్యం

- పేదల ముఖ్యమంత్రిని గెలిపించుకోవడం అందరి బాధ్యత
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి 7,8 వార్డులలో 184 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి

సత్తెనపల్లి: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేశారని, ఇచ్చిన మాట కోసం కట్టుబడి మడమ తిప్పకుండా పేదలకు అండగా నిలిచారని, ఇటువంటి ముఖ్యమంత్రిని గెలిపించుకోవడం మన అందరి బాధ్యత అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 7,8 వార్డుల్లో సోమవారం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ, అనంతరం జరిగిన సభలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లులో భాగంగా పేదల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు హామీలను మాఫీ చేశారని విమర్శించారు. డ్వాక్రా, రైతు రుణమాఫీల పేరిట ప్రజలను వంచించి అధికారం చేజిక్కించుకున్నారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ జరగని రీతిలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఉచితంగా సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసి హక్కులు బదలాయించిన పత్రాలు అందిస్తున్నామని వివరించారు. పేదల సొంతింటి కలను జగనన్న సాకారం చేశారని గుర్తు చేశారు. తొలుత 7, 8 వార్డులలో వైఎస్సార్ సీపీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం 7 వార్డులో 46 మందికి, 8వ వార్డులో 138 మందికి, మొత్తం 184 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, న్యాయవాదులు రాజవరపు శివనాగేశ్వరరావు, పోతల రవి కుమార్, 8వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి ప్రమీల, 7,8 వార్డుల ఇన్‌చార్జ్‌లు దేవరశెట్టి రవికుమార్, రేపూడి విజయకుమారి, రేపూడి రవితేజ, నాయకులు కోటేశ్వరరావు, సలగాల మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

చక్కటి దరహాసం కాదంత కష్టం

- దంత వైద్యంలో ఆధునిక పద్ధతులు
- అందుబాటులో కాస్మొటిక్ వైద్యవిధానం
- చిన్నారులకు పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్
- రేపు జాతీయ దంత వైద్యుల దినోత్సవం



జీజీహెచ్‌లో దంత వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ భవనం ప్రతాప్‌రెడ్డి

గుంటూరు మెడికల్: దంత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, దంత వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు ప్రతి ఏడాది మార్చి 6వ తేదీన జాతీయ దంత వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కాస్మొటిక్ వైద్య పద్ధతులు..

ఒకప్పుడు పన్ను పుచ్చిపోతే పీకి వేయడం తప్ప వేరే ఆలోచన ఉండేదికాదు. నేడు దంత వైద్యశాస్త్రం (డెంటిస్ట్రీ) బాగా అభివృద్ధి చెందడంతో పూర్తిగా పాడైన పళ్లను సైతం పీకే పనిలేకుండా మరమ్మతులు చేసి సాధారణ దంతంలాగా తయారు చేస్తున్నారు. నేడు పన్ను పీకకుండా రూట్‌కెనాల్ చికిత్స అందుబాటులో ఉంది. పాచిపట్టిన, గార పట్టిన పళ్లను స్కేలింగ్ ద్వార శుభ్రం చేస్తున్నారు. కదిలిన, అరిగిన పళ్లకు, చిగుళ్ల సమస్యకు ఫ్లాప్ సర్జరీ, పళ్లు లేనివారికి (ఊడిపోయినవారికి) ఇంప్లాంట్స్ సహాయంతో ఫిక్స్‌డ్ పళ్లు, షుగర్‌వల్ల దంతాలు ఊడిపోతున్నవారికి బేసల్ ఇంప్లాంట్స్ ద్వారా ఫిక్స్‌డ్ పళ్లు, ఎత్తు పళ్లు, వంకర పళ్లు ఉన్నవారికి కాస్మొటిక్ బ్రెసెస్‌తో ఆర్థో ట్రీట్‌మెంట్ సేవలు ఉన్నాయి. చిన్న పిల్లలకు పళ్లు పుచ్చిపోకుండా పళ్ళు ఎగుడుదిగుడులా లేకుండా పళ్ల వరుస అందంగా ఉండేలా పిడోడాంటిక్ ట్రీట్‌మెంట్ నేడు అందుబాటులో ఉంది. సాధారణ చికిత్సల మాదిరిగా దంత వైద్యంలో సైతం కాస్మొటిక్ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ముఖారవిందం పాడవకుండా చిరునవ్వులు చెరిగిపోకుండా దంతాలను అందంగా అమర్చుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం



జీజీహెచ్‌కు ప్రతిరోజూ 50 నుంచి 60 మంది వివిధ రకాల దంత సమస్యలతో వస్తున్నారు. పుచ్చిపోయిన దంతాలను సిమెంట్‌తో ఫిల్ చేయడం, బాగా పుచ్చిపోయిన దంతాలను కొద్దిపాటి మత్తు ఇచ్చి పీకివేయడం, గార పట్టిన దంతాలను క్లీనింగ్ చేస్తున్నారు. స్పెషాలిటీ వైద్య నిపుణులు అందుబాటులో ఉండటంతో అత్యాధునిక దంత శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. – డాక్టర్ సి.హెచ్.పార్వతి, దంత వైద్య విభాగాధిపతి, జీజీహెచ్

దంత సమస్యలపై అవగాహన అవసరం..



ప్రతి ఒక్కరు దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే దంత వైద్యులను సంప్రదించటం ద్వారా పన్ను పూర్తిగా పాడవ్వకుండా వైద్యం అందించవచ్చు. పిల్లలకు తరచుగా దంత వైద్య సమస్యలు వస్తుంటాయి. వాటిని తల్లిదండ్రులు గమనించి దంత వైద్యులను సంప్రదించాలి. ఆహారం తిన్న వెంటనే నోటిలో నీరు పోసుకుని పుక్కిలించాలి.

– డాక్టర్ చింతా వాసవి, దంత వైద్య నిపుణురాలు

'సిద్ధం' సభకు సన్నద్ధం కండి

మంత్రి అంబటి రాంబాబు



లంకెలకూరపాడు గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 10న ప్రకాశం జిల్లా మేదరమెట్ల సమీపంలో నిర్వహించనున్న 'సిద్ధం' సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధం కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో సభ సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. బుల్లెట్‌పై సత్తెనపల్లి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి గ్రామానికి చేరుకున్న మంత్రి గ్రామస్తులతో సమావేశమయ్యారు. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, మరలా ముఖ్యమంత్రి గా జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి తీరుతారని జోస్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమిష్టిగా పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మమేకమయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ మోర్తాల వెంకట రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

- 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష
- ఒక్కో పాఠశాలలో అదనంగా 20 సీట్లు పెంపు
- జిల్లాలో 14 మోడల్ పాఠశాలల్లో 1,400 సీట్ల భర్తీ



దాచేపల్లిలోని మోడల్ పాఠశాల భవనం

సత్తెనపల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్ల భాషతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర సబ్జెక్టుల్లో పట్టు తప్పనిసరి. ఇవన్నీ గతంలో ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లకే పరిమితమయ్యేవి. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేద విద్యార్థికి ఉత్తమ విద్యను అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలలు (ఏపీ మోడల్ స్కూళ్లు/జూనియర్ కళాశాలలు) నేడు రాష్ట్ర ప్రభుత్వ ఆదరణతో సత్ఫలితాలు సాధిస్తున్నాయి. పరీక్షలు ఏవైనా ఫలితాల్లో ముందంజలో దూసుకెళ్తున్నాయి. ఈ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు.

3 నుంచి దరఖాస్తుల స్వీకరణ...

2024-25 విద్యా సంవత్సరానికి గానూ మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఈనెల 2 నుంచి నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్/ డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో ఎగ్జామినేషన్ ఫీజు చెల్లుబాటు కానుంది. దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ఈ నెల 3 నుంచి మొదలైంది. ఆన్‌లైన్ పేమెంట్ కు ఈనెల 31వ తేదీతో గడువు ముగియనుంది.

జిల్లాలో 14 మోడల్ పాఠశాలలు..

జిల్లాలో ఈపూరు, బొల్లాపల్లి, వినుకొండ, చిరుమామిళ్ల, దాచేపల్లి, దేచవరం, దుర్గి, గురజాల, జెట్టిపాలెం(గోలి), కారంపూడి, క్రోసూరు, నూజెండ్ల, వెల్దుర్తి, విప్పర్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో మోడల్ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ఆరో తరగతికి గతంలో 80 సీట్లు మాత్రమే కేటాయించేవారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్‌కు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ సానుకూలంగా స్పందిస్తూ 100 సీట్లకు పెంచారు. ఈ లెక్కన 14 మోడల్ పాఠశాలలో 1,400 మంది విద్యార్థులకు ప్రవేశాలు దక్కనున్నాయి. ఒక్కో సీటుకు ఐదు నుంచి పది మంది విద్యార్థులు పోటీ పడే అవకాశాలు ఉన్నాయి

టెన్త్ ఫలితాల్లో హవా...

ఏపీ మోడల్ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు వస్తున్నాయి. దీంతో ఏపీ మోడల్ పాఠశాలలో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా ఏపీ మోడల్ పాఠశాలల్లో 74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో అత్యధికులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం.

పాత పద్ధతిలో పరీక్ష...

లాటరీ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి దరఖాస్తు చేసుకున్న మోడల్ పాఠశాలలోనే ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. ప్రతిభ ఆధారంగా రోస్టర్ పద్ధతిలో సీట్లు కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్ట్, 29న ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తారు. 30న సర్టిఫికేట్ల పరిశీలన, కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

రిజర్వేషన్లు ఇలా..

15 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు, 29 శాతం బీసీలకు (7శాతం బీసీ-ఏ, 10 శాతం బీసీ-బీ, ఒక శాతం బీసీ-సీ, 7 శాతం బీసీ-డీ, 4 శాతం బీసీ-ఈలకు) సీట్ల కేటాయింపులు ఉంటాయి. దివ్యాంగులకు 3 శాతం, బాలికలకు 33.33 శాతం సీట్లు కేటాయించారు. 50 శాతం సీట్లు ఇతర కులాలకు నిర్దేశించారు.

ఎంపిక ఇలా...

- ఆరో తరగతిలో ప్రవేశం పొందే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. వీరు ప్రవేశ పరీక్షలో కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. పరీక్షా ఫీజు రూ.150లు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 30 మార్కులు పొంది ఉండాలి. పరీక్షా ఫీజు రూ. 75లు మాత్రమే.
- దరఖాస్తుతో పాటు ఆధార్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఒక పాస్ పోర్టు సైజ్ ఫోటో, విద్యార్హత సర్టిఫికెట్ ఆయా మండలాల్లోని మోడల్ పాఠశాలలో అందజేయాలి.
- ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో 4, 5 తరగతులు చదివి ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి.
- పరీక్షలో వచ్చే మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు.
- సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ లేదా ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



స్పందనలో ఎస్పీకి సమస్యలను వివరిస్తున్న మహిళ

నరసరావుపేట: సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల్లో అధిక భాగం కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అందుకున్నారు. త్వరితగతిన ఫిర్యాదుదారుల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. స్థానికులు అనుమాలశెట్టి వెంకట సీతారామయ్య, వెంకట మల్లేశ్వరరావుల సహకారంతో స్పందన ఫిర్యాదుదారులకు అన్నదానం నిర్వహించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, దిశ డీఎస్పీ సుధాకరరావు, నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రధాన కార్యదర్శిగా కమలాకరరెడ్డి



నియామకపత్రాన్ని స్వీకరిస్తున్న కమలాకరరెడ్డి

నరసరావుపేట: జాతీయ మానవ హక్కుల మండలి(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఇంజినీరింగ్ విభాగంలో ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొమ్మసాని కమలాకరరెడ్డి నియమితులయ్యారు. ఈనెల 3న ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ లెవెల్ సెమినార్‌లో ఎంపిక జరిగిందని కమలాకరరెడ్డి సోమవారం వెల్లడించారు. జాతీయ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్, ఇంజినీరింగ్ విభాగ చైర్మన్ వేల్పుల రామన్న, పలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగారుతల్లి పథకంపై అవగాహన కల్పించండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: బంగారుతల్లి పథకం ద్వారా విద్యార్థినుల రక్తహీనత సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు బంగారు తల్లి కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారుతల్లి కార్డు పొందిన విద్యార్థిని తల్లిదండ్రులకు రక్తహీనత సమస్యను వివరించి కార్డు ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. బంగారుతల్లి పథకం పీఎం ఎక్సలెంట్ అవార్డుకు షార్ట్‌లిస్ట్ చేయబడి ఉందన్నారు. హెచ్ఎంలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ పథకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.

ఇంటర్ పరీక్షకు 770 మంది విద్యార్థులు గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 48 పరీక్షా కేంద్రాల్లో ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు కలిపి 770 మంది గైర్హాజరయ్యారు. ఇంగ్లీషు పరీక్షకు 15,368 మంది హాజరు కావాల్సి ఉండగా 14,714 మంది హాజరయ్యారు. 654 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 929 మందికి గానూ 813 మంది హాజరు కాగా 116 మంది గైర్హాజరయ్యారు.

సీఎం జగన్ పాలనలో సొంతింటి కల సాకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

నరసరావుపేట: పేదలకు ఇళ్ల పట్టాలు రానీయకుండా చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం భువనచంద్ర టౌన్ హాలులో పురపాలకశాఖ ఆధ్వర్యంలో జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు అందజేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలోని 7,177మందికి 157ఎకరాలు కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. దీనిలో కొంత ప్రభుత్వ భూమి ఉండగా మరికొంత ప్రైవేటు భూమి కొనుగోలు చేసి ఇవ్వటం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 32 లక్షల మంది పేదలకు 71వేల ఎకరాలను రూ.76 లక్షల కోట్ల వ్యయంతో కొనుగోలుచేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. టిడ్కో గృహాలకు వెళ్లేందుకు సీసీ రోడ్లు వేయించామని, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం జరిగిందన్నారు. ఇప్పుడు ఒక్కొక్క ప్లాటుకు ఉచితంగా రూ.8 వేల ఖర్చుతో ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారన్నారు. దీని వలన పదేళ్ల తర్వాత విక్రయించుకునే హక్కు కల్పించారని, కుదువ పెట్టి బ్యాంకుల ద్వారా రుణం కూడా పొందవచ్చన్నారు. ఇళ్ల పట్టాలకోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్న 1100 మందికి మళ్లీ ముఖ్యమంత్రి జగన్ సీఎం కాగానే ఇవ్వటం జరుగుతుందని స్పష్టం చేశారు. వార్డుల వారీగా రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, ముదిరాజు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు మాగులూరి రమణారెడ్డి, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, జి.అచ్యుతరావు, మల్లెల అశోక్, వేముల శివ, రామిశెట్టి కొండ, మద్రిపూడి రాంబాబు పాల్గొన్నారు.



హాజరైన లబ్ధిదారులు

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన పల్నాడు క్రీడాకారులు



గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

సత్తెనపల్లి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజీ పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీకి ఎంపికయ్యారు. పురుషుల జట్టులో అశోక్ కుమార్ 66 కేజీల విభాగంలో బంగారు పతకం, టి శివ 66 కేజీల విభాగంలో రజత పతకాలు సాధించారు. మహిళా విభాగంలో ఎం అనూష 47 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించగా టి జ్యోతి 76 కేజీల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుంది. పల్నాడు టీమ్ ఓవరాల్ టైటిల్స్ స్ట్రాంగ్ మెన్‌గా ఎం.అశోక్ కుమార్, స్ట్రాంగ్ ఉమెన్‌గా టి జ్యోతి నిలిచారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీకి ఎం అశోక్, ఎం అనూష, టీ జ్యోతి ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సెక్రెటరీ, కోచ్ వసుపులేటి సురేష్, ప్రెసిడెంట్ జిమ్ రాజు, ఎస్ మణిరత్నం, పి.శంకర్, తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుడికి కారు అందజేసిన కలెక్టర్



లబ్ధిదారుడికి కారు తాళాలు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు చెందిన యువతీ యువకులకు అందించే సహాయంలో భాగంగా రెంటచింతల మండలం తుమృకోట గ్రామానికి చెందిన రెంటపాళ్ల కోటేశ్వరరావుకు రూ.10 లక్షల విలువైన స్విఫ్ట్ డిజైర్ కారును సోమవారం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించే నవోదయంలో తనకు ఉపాధి చూపించాలని దరఖాస్తు చేసుకున్న కోటేశ్వరరావుకు కలెక్టర్ ఆదేశాల మేరకు తుమృకోట యూనియన్ బ్యాంకు మేనేజర్ సురేష్‌కుమార్ బ్యాంకు ద్వారా ఆర్థిక సహాయంతో సబ్సిడీపై కారును లబ్ధిదారునికి మంజూరు చేశారు. నవోదయం నోడల్ అధికారి కె.సంజీవరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ పాల్గొన్నారు.

పొలం, స్థలం పత్రాలు అందజేత

ఇటీవల గుత్తి కొండ వద్ద సజీవ దహనానికి గురైన దార్ల సాంబశివరావు కుటుంబం జీవనోపాధికై జిల్లా కలెక్టర్ శివశంకర్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో ఒక ఎకరా పొలం, మూడు సెంట్ల ఇంటి స్థలం పత్రాలు అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, డీఆర్వో కె.వినాయకం, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి హత్యకేసులో నిందితుల అరెస్టు

వినుకొండ(నూజెండ్ల): ఇటీవల బొల్లాపల్లి మండలం మాలపాడు గ్రామానికి చెందిన బి.తులసీనాయక్ హత్య కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించి నిందితులను పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకర్ సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. మాలపాడు గ్రామానికి చెందిన రమావత్ శివానాయక్ తండ్రి సీతయ్యనాయక్ అనారోగ్యంతో 2022 డిసెంబరులో చనిపోయాడు. తన తండ్రిని చేతబడి చేసి చంపాడని తులసీనాయక్‌పై శివానాయక్ అనుమానం పెంచుకున్నాడు. ఫిబ్రవరి 21న ఈపూరు అగ్నిగుండాల వద్దగల తన పొలంలో పనులు ముగించుకొని తులసీనాయక్ ఇంటికి వస్తుండగా బొల్లాపల్లికి చెందిన గంగిరెడ్డి నాగిరెడ్డి సహాయంతో గంగులపాలెం గ్రామానికి చెందిన జరుగుల రామాంజనేయులు బంధువు ఎర్రపిల్లి గంగ ద్వారా కర్రలతో కొట్టి హత్య చేయించినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం మృతుడి ద్విచక్రవాహనాన్ని తగులబెట్టారు. మృతుని భార్య వాగిబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. రూరల్ సీఐతో పాటు బండ్లమోటు ఎస్ఐ డి.చెన్నకేశవులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.